క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: ఈనెల 29వ తేదీ మంగళవారం పుల్లలచెరువు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన సమావేశం ఉంటుందని, కావున ఎంపీటీసీలు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. తగిన సమాచారంతో అధికారులు సమావేశానికి హాజరు కావాలని ఆయన తెలిపారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గుంటిగంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మెట్టేల బాలరాజు, పి. విజయలక్ష్మి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు కామేశ్వరశర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, కానుకలు సమర్పించారు. ఆలయం పక్కన ఉన్న పుట్ట, నాగశిలలను భక్తులు, మల్లికార్జునస్వామి వారిని పూజించారు. ఆలయ ఈఓ జి.వాసుబాబు, చైర్మన్ కె .గురుబ్రహ్మం, ఏఆర్ కె .ప్రసాద్ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాన్ని పర్యవేక్షించారు.

ప్రైవేటులో ఉచిత సీట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

యర్రగొండపాలెం: ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా చేరే విద్యార్థులు సోమవారం నుంచి దరఖాస్తులు చేస్తుకోవచ్చని ఎంఈవో ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో తమ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12 (1) ఆధారంగా ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో ఎటువంటి ఫీజులు చెల్లించకుండా చేరే విద్యార్థులకు 25 సీట్లు కేటాయించారని, ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలు, బలహీన వర్గాల పిల్లలు ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ స్కూళ్లలో చేరవచ్చని ఆయన తెలిపారు. సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణాలలో రూ.1.44 లక్షల లోపు ఆదాయం ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన వారు అర్హులని, ధ్రువీకరణ కోసం తమ ఆధార్ కార్డ్, బియ్యం కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ లాంటివి జత చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. అర్హులైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మైమరిపించిన వీణా వాదనం

ఒంగోలు మెట్రో: స్థానిక శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఒంగోలుకు చెందిన లలితా గాయత్రి సంగీత నిలయం కళాకారులు మద్దులూరి లక్ష్మీ వసుంధర బృందం ఆదివారం తమ వీణా వాదనం సంగీత ప్రదర్శనతో భక్తులు, కళాభిమానులను తన్మయులను చేశారు. ముద్దుగారే యశోద, చక్కటి తల్లికి చాంగు భళా, అదివో అల్లదివో వంటి తాళ్లపాక అన్నమాచార్యులు విరచిత సంకీర్తనలతో పాటు పాహి రామా ప్రభో వంటి పలు భక్తిరస సంకీర్తనలను వీణలపై సుతారంగా పలికించి వీణా వాదనంలో తమ ప్రజ్ఞను రుజువు చేసి కళాభిమానుల అభినందనలు అందుకున్నారు. చక్కటి వీణా వాదనం సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన శ్రీగిరి దేవస్థాన నిర్వాహకులను పలువురు అభినందించారు. వీణా వాదనం సంగీత కళాకారులు మద్దులూరి లక్ష్మీ వసుంధర, ఎన్‌జీ ప్రవల్లిక, ఎం.మానసిలను శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారితో పాటు ఆలూరు జై శంకర్ అభినందించి సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, సంగీతాభిమానులు హాజరయ్యారు. భక్తులకు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో కాలభైరవ పూజలు

ఒంగోలు మెట్రో: ఒంగోలు స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరురోడ్డులోని గాయత్రి మందిరంలో ఆదివారం ఉదయం విశ్వావసు నామ సంవత్సర మొదటి అమావాస్య సందర్భంగా కాలభైరవ చిత్రపటానికి ప్రముఖ పురోహితుడు మల్లికార్జునశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వర్ణాకర్షణ వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాదాలు అందజేశారు. స్వర్ణాకర్షణ కాలభైరవ సేవా సమితి నిర్వాహకులు దేసు వెంకట సుబ్బారావు, పబ్బిశెట్టి భానుకిరణ్, పచ్చిపులుసు శ్రీకాంత్, దేసు కాశీవిశ్వేశ్వర రావు, మనోహర్, గడ్డం రాజేష్, పచ్చిపులుసు లోకేష్, భాస్కరుని మురళీమోహన్, ప్రశాంత్ సుబ్బరాజు, సునీల్, కారంశెట్టి అమర్, సమితి సభ్యులు పాల్గొన్నారు.

కనికరం లేని కూటమి..

మిర్చి రైతుల ఓటమి!


గొబ్బూరులో మిరప కాయలు కోస్తున్న కూలీలు


కల్లంలో ఎండు మిర్చిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- కన్నీరుమున్నీరవుతున్న అన్నదాతలు
- ఏడాది కూలీల ఖర్చు కూడా రాదంటున్న అన్నదాతలు
- గిట్టుబాటు ధరపై చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

పెద్దారవీడు: ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతన్నలు పూర్తిగా నష్టపోయారు. ఏ పంట పండించినా సరైనా గిట్టుబాటు ధర లేకపోవడంతో పంటను ఏం చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. నాడు వ్యవసాయం పండగలోనుంచి నేడు వ్యవసాయం చేయడం దండగ అన్న స్థితిలో రైతన్నలు కూరుకుపోయారు. కనికరం లేని కూటమి ప్రభుత్వ పాలనలో అన్నదాత కంట కన్నీరు పెట్టుకున్నాడు. మద్దతు ధర కల్పించలేక మిరప రైతులను నిండా ముంచింది. మార్కెట్లో ధర అమాంతం పడిపోవడంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. నష్టాలకు దిగుబడులు అమ్ముకుంటూ అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ఆరుగాలం శ్రమించినా సరైన గిట్టుబాటు ధరలు లేక అప్పుల బాధతో **కర్షకులు** కన్నీరు మున్నీరవుతు**న్నారు.** ప్రస్తుతం మిర్చి రై**తుల** పరిస్థితి చాలా దయ**నీ**యంగా మారింది. ఎక**రా**కు లక్షలాది రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టినా పరిస్థితి శూన్యంగా మారింది. జెమినీ వైరస్, తెగుళ్లు, అధి**క** వర్షాలు తట్టుకొని పంట**ను** కాపాడుకున్నా గిట్టు**బాటు** ధర లేక రైతులు విలవి**ల్లాడుతు**న్నారు. ఇంటిల్లిపాది క**ష్టపడి పండిం**చిన మిర్చికి ప్రస్తుతమున్న **ధరకు అమ్మితే** కూలీ కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కనికరించక పోతే రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. మండలంలో 4500 ఎకరాలు మిరప పంట రైతులు సాగు చేశారు.

కూలీ ఖర్చులు కూడా రాని దుస్థితి..

మిర్చి ధర గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది **బాగా తగ్గ**డమే కాకుండా కొద్ది **రోజులు**గా మరింత **పత**నం కావడంతో **మ**రింత ఆందోళనకు గురవుతున్నారు. క్వింటా మిర్చి కోయడానికి కూలీలకు రూ.5 వేలు ఖర్చవుతోం**ది**. ప్రస్తుతం ఉన్న ధరకు రైతులు మిర్చిని అమ్మితే కూలీల ఖర్చులు కూడా రావని రైతులు వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజిలలో ఉంచుదామంటే ధర పెరుగుతుందన్న ఆశా లేదు. బ్యాంకులలో, ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో చేసిన అప్పులు ఎలా తీర్చాలని లోలోనా కుమిలిపోతున్నారు. పెట్టుబడి కోసం తీసుకున్న అప్పులకు వడ్డీలు రెట్టింపు అవతున్నాయి. అలా అని అమ్ముకుందామంటే కూలీ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. అప్పుల బాధలు భరించలేక కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితిల్లో వ్యాపారులు అడిగిన ధరకే మిర్చిని తెగ నమ్ముకుంటున్న ఘటనలు గ్రామాల్లో చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం కనికరించక పోతే రైతులు రోడ్డున పడే పరిస్థితి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాతాళానికి మిర్చి ధరలు..

గత ప్రభుత్వం హయంలో మిర్చి రూ.16 వేల నుంచి రూ.20 వేల వరకు విక్రయించాం. ప్రస్తుతం మార్కెట్లో మిర్చి ధరలు పాతాళానికి పడిపోయాయి. క్వింటా రూ 6 వేల నుంచి రూ.7 వేలు మాత్రమే లభిస్తోంది. మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు చర్యలు తీసుకుంటామన్న కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో శూన్యం. మిర్చి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యానికి ఇది నిదర్శనం.


కల్లంలోని ఎండు మిర్చిని చూపిస్తున్న రైతు వెంకటేశ్వరరెడ్డి

అమాంతం పెరిగిన సాగు ఖర్చు..



ఈ ఏడాది రెండు ఎకరాలు మిరప పంట సాగు చేశాను. దాదాపు రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టాను. క్వింటా రూ.8 వేల ప్రకారం అమ్మితే రూ.1 లక్ష వచ్చినాయి. దీంతో పెట్టిన పెట్టుబడి రాక తీవ్రంగా నష్టపోయాను. గతేడాది క్వింటా రూ.18 వేలు నుంచి రూ .20 వేల వరకు ధర పలికింది. పెట్టుబడి, కూలీల ఖర్చులు పోగా రూ.2 లక్షలు ఆదాయం వచ్చింది. ఈఏడాది అప్పులే మిగిలాయి.

– దూదెకుల తుమ్మల సాహెబ్, రైతు, గొబ్బూరు

అప్పులే మిగిలాయి..



నేను కౌలుకు రెండు ఎకరా పొలంలో తేజా రకం మిర్చి సాగు చేశాను. రెండు ఎకరాలకు కౌలు రూ.30 వేలు ఇచ్చాను. మార్కెట్లో తేజా రకం క్వింటా రూ.10 వేలు మాత్రమే ధర పలికింది. 15 క్వింటాళ్ల మిర్చి రూ.10 వేల చొప్పున విక్రయించాను. ప్రస్తుతం 25 క్వింటాళ్లు మిర్చి అమ్మకానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా రూ.8 వేలు అడుగుతున్నారు.

– నారా సత్యనారాయణరెడ్డి, బద్వీడుచెర్లోపల్లి

మా రోడ్డును పట్టించుకోండి సారూ!

దర్శి(కురిచేడు): మండలంలోని చందలూరు నుంచి బండివెలిగండ్ల వెళ్లే రోడ్డు గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. నిత్యం బండి వెలిగండ్ల, లింగన్నపాలెం గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రజలు అనేక పనుల కోసం, వైద్య చికిత్సల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోలు, ట్రాక్టర్లు, రాకపోకలు సాగిస్తుంటాయి. రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లు వేశామని ప్రచారం చేసుకుంటున్న పాలకులు ఒకసారి మా రోడ్డును చూడాలని ఆయా గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు కనీసం గుంతలు కూడా పూడ్చలేదని, దాని వలన పొలాల నుంచి పంట ఉత్పత్తులను ఇళ్లకు చేర్చుకోవడం ఇబ్బందిగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్లు నిత్యం గుంతలలో పడి మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చందలూరు నుంచి బండివెలిగండ్ల వరకు ఉన్న తారురోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.


గుంతలు తేలిన చందలూరు-అరవెళ్లపాడు తారురోడ్డు

నేటి నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

దర్శి(కురిచేడు): శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు వీ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులకు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు 15 ఏళ్లలోపు విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. ఈ తరగతుల్లో కథలు చెప్పడం, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్స్, క్యారమ్స్, చెస్, డాన్సు, ఆటలు, పాటలు ఇతర అంశాలు నేర్పిస్తారని ఆమె తెలిపారు. పై అంశాల్లో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి స్వచ్ఛందంగా ఆసక్తి గల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ముందుకు వచ్చి తమ సేవలను అందించాలని ఆమె కోరారు. ఈక్యాంపులో దాతలు ఎవరైనా విద్యార్థులకు అల్పాహారం, మజ్జిగ, ఇతర శీతల పానీయాలు అందించవచ్చన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

పెద్దదోర్నాలలో..

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఈ శిబిరం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరంలో ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు కథలు చదివి వినిపించడం, 8.30 నుంచి 9.30 వరకు ఆటలు ఆడించటం, 9.30 నుంచి 9.40 వరకు విరామ సమయం, 9.40 నుంచి 10 గంటల వరకు పుస్తక పఠనం, 10 గంటల నుంచి 11 గంటల వరకు స్పోకెన్ ఇంగ్లిష్, చిత్ర లేఖనం, సంగీతం, నృత్యం, చదరంగం, క్యారమ్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కురిచేడులో...

కురిచేడు: నేటి నుంచి జూన్ 6వ తేది వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకురాలు సుమతి తెలిపారు. ఈ వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులకు ఉచితంగా చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లిష్, వివిధ సృజనాత్మక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

నేడు నూతన తహశీల్దార్ విధుల్లో చేరిక

పుల్లలచెరువు: పుల్లలచెరువు నూతన తహశీల్దార్ కే వెంకటేశ్వరరావు సోమవారం విధుల్లో చేరనున్నారు. గత తొమ్మిది నెలలుగా పుల్లలచెరువు కు రెగ్యులర్ తహశీల్దార్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా అధికారులు పొన్నలూరు రీ సర్వే డిప్యూటి తహశీల్దార్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావుకు అడ్‌హాక్ ప్రమోషన్ ఇచ్చి పుల్లలచెరువు తహశీల్దార్‌గా నియమించడంతో ఆయన సోమవారం విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

వేసవిలో పిల్లలు, వృద్ధులు జాగ్రత్త

దొనకొండ:

వేసవిలో ఎండలు విజృంభిస్తున్నందున వలన పిల్లలు, వృద్ధు బయటికి రావద్దని.. పని నిమిత్తం వస్తే ఉదయం 10 గంటలకు ఇంటికి చేరుకోవాలని స్థానిక వైద్యాధికారి ఎం.అన్వేష్ కొన్ని సూచనలు, సలహాలు చెప్తున్నారు. బయటకు వచ్చే సమయంలో తలపై టోపి పెట్టుకోవాలని లేదా రుమాలు కట్టుకోవాలని, తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. ప్రజలు ఎండలో నుంచి వచ్చిన వెంటనే తేనె వంటి తీపి పదార్థాలు తీసుకోవద్దన్నారు. ఉదయం 10 గంటల నుంచి 4 గంటల కాలంలో బయటకు రావద్దని తెలిపారు. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన చల్లటి మజ్జిగ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకోవాలన్నారు. వడ దెబ్బకు గురైన వారిని చల్లని ప్రదేశాల్లో కాని, దగ్గరలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. ముఖ్యంగా పిల్లలను తల్లిదండ్రులు విచ్చలవిడిగా బయట ప్రదేశాల్లో తిప్పవద్దన్నారు. బయటికి వెళ్లిన సమయంలో తెల్లటి కాటన్ దుస్తులను ధరించాలని ఆయన తెలిపారు. వడ దెబ్బకు గురైన వారిని తడి గుడ్డతో శరీరమంతా రుద్దుతూ ఉండాలన్నారు. బయటి నుంచి ఎండకు ఇంటికి చేరుకుని చల్లని నిమ్మరసం, కొబ్బరి నీరు లేదా చల్లటి నీరు తాగాలన్నారు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగటం, ఇతర అనారోగ్య సమస్యలు ఏర్పడితే దగ్గరలో ఉండే వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని వైద్యాధికారి వివరించారు.

తాగునీరందక.. తంటాలు తప్పక!


అలంకార ప్రాయంగా ఓవర్‌హెడ్ ట్యాంకు


రక్షిత నీటి సంపు వద్ద పేరుకున్న చెత్త


కుళాయి ద్వారా సన్నగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న యువకులు

- అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటికి ఇబ్బందులు

దర్శి (కురిచేడు): అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండలు మండుతూ నీటికోసం అల్లాడుతున్న తరుణంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందుబాటులో ఉండి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్నారు. మండలంలోని తూర్పు చౌటపాలెం గ్రామంలో సుమారు రూ.30 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి, పైపులైను వేసి ట్యాపుల ద్వారా నీటిసరఫరా చేయాల్సి ఉంది. కాని అధికారుల పర్యవేక్షణ లేక నీటి సరఫరా కుంటు పడింది. గ్రామంలోని రెండు కుళాయిలు మాత్రమే ఉన్నాయి. అందులో నీరు తక్కువగా వస్తుండటంతో ప్రజలు వేచి చూడలేక ఆరు కిలోమీట్ల దూరంలోని దర్శి నుంచి మినరల్ వాటర్ కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. వాహనాలు లేని వారు గత్యంతరం లేక గ్రామంలోని బోర్ల నీరు తాగుతున్నారు.

ట్యాంకు చుట్టూ చెత్తాచెదారమే..

రక్షిత నీటి సంపు కంపచెట్ల మధ్యలో ఉండి చుట్టూ చెత్త చేరి మురుగు కూపంలా మారింది. ఆ మురుగు కూపం నుంచి దుర్గంధం వెదజల్లుతోంది. దాంతో అరకొరగా నీరు వారు కూడా తాగలేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వలన మండు వేసవిలో ప్రజలు నీటి కష్టాలను ఎదుర్కొవాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి సంపు వద్ద శుభ్రం చేయించి, ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి గ్రామంలో కుళాయిల ద్వారా నీరు సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మంతనాలమ్మ దర్శనంలో మాజీ ఎమ్మెల్యే

పెద్దదోర్నాల: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన గిరిజనుల ఆరాధ్య దైవం మంతనాలమ్మకు మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కేపీ కొండారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి పెద్దమంతనాల గిరిజన గూడేనికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే దైవంగా ప్రఖ్యాతి గాంచిన మంతనాలమ్మ ఆలయంలో ప్రతి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించటం ఆనవాయితీ. నూతనంగా వాహనాలు కొనుగోలు చేసిన వారు తమ కోరికలు తీరాలంటూ మొక్కులు మొక్కేవారు. ప్రతి ఆదివారం ఈ ప్రాంతానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచే కాక నంద్యాల జిల్లా నందికొట్కూరు, ఆత్మకూరు, మహబూబ్‌నగర్ జిల్లా అచ్చంపేట తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఈ ప్రాంతానికి చేరుకుని తమ మొక్కులు తీర్చుకుంటారు. ఇందులో భాగంగా మాజీ ఎమ్మెల్యే తమ మొక్కులను ఆదివారం చెల్లించుకున్నారు. వీరితో పాటు మండలానికి చెందిన పలువురు నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేతో గంటా గురవారెడ్డి తదితరులు ఉన్నారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డి

దేవాలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు

పెద్దారవీడు: మండలంలో గుండంచర్ల గ్రామం సమీపంలో నల్లమల అడవిలో వెలసిన గంగాభవానీ వేనూతల కాటమరాజుస్వామి, పెద్దారవీడు గ్రామం సమీపంలో వెలసిన అంకాళమ్మ దేవత, ఎస్ కొత్తపల్లి గ్రామం సమీపంలో నాగాంజనేయస్వామి పుట్టకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కాటమరాజు స్వామి, గంగభవానీ దేవతకు అభిషేకాలు, పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అంకాళమ్మ దేవతకు మహిళలు పసుపు, కుంకుమ, చీరలు, గాజులు, పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో అలంకరించారు. నాగమయ్య పుట్టకు పాలు, పండ్లు సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని, కాయకర్పూరం సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో కాటమరాజుస్వామి

ఆర్థిక లావాదేవీలపై శిక్షణ

మద్దిపాడు: మండల మహిళా సమాఖ్య, డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఆదివారం సమైక్య సంఘాల ఆర్థిక లావాదేవీలపై లోకోస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఏపీఎం కాకుమాను సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ట్రైనర్లు పి.ఈశ్వరి, పి.ముబినా మద్దిపాడు మండల మహిళా సమాఖ్య, గ్రామ సమాఖ్యలలో జరుగుతున్న ఆర్థిక లావాదేవీలపై లోకోస్ శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల శిక్షణలో భాగంగా ఆదివారం మొదటిరోజు శిక్షణ పూర్తిచేశారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు పల్లె శ్రావణి, ఎల్‌సీసీజీ వెంకటసుబ్బయ్య, మండలంలోని వీవోఏలు పాల్గొన్నారు.